"పరమతము, పరచింతన మరియు పరదర్శన నుండి ముక్తులుగా అవ్వండి మరియు పరోపకారము చెయ్యండి"

ఈ రోజు బాప్ దాదా తమ నలువైపులా ఉన్న తండ్రి పిల్లలు ఎవరైతే ఉన్నారో, విశేషమైనవారో, ఆ సర్వ విశేషాత్మలను చూస్తున్నారు. భారత్ లో కావచ్చు లేక విదేశములో కావచ్చు ఏ మూలన ఉన్నా కానీ బాప్ దాదా విశేషాత్మలందరినీ సమీపంగా చూస్తున్నారు. బాప్ దాదాకు తమ విశేషమైన పిల్లలను చూసి సంతోషం కలుగుతుంది. ఎలాగైతే పిల్లలైన మీకు తండ్రిని చూసి సంతోషం కలుగుతుంది కదా! సంతోషం కలుగుతుంది కావుననే పరుగెత్తుకుని వచ్చారు కదా. అలాగే నా ఒక్కొక్క బిడ్డ విశేషమైన ఆత్మ అని తండ్రికి కూడా సంతోషం కలుగుతుంది. వారు వృద్ధులు కావచ్చు, చదువుకోనివారు కావచ్చు, చిన్న పిల్లలు కావచ్చు, యువత కావచ్చు, ప్రవృత్తిలోని వారు కావచ్చు కానీ మొత్తము విశ్వము ఎదురుగా వారు విశేషమైనవారు. ఎంత గొప్ప-గొప్ప వైజ్ఞానిక అద్భుతాలను చూపించేవారైనా కానీ, చంద్రుని వరకు కూడా చేరుకునేవారైనా కానీ బాబా యొక్క విశేషమైన పిల్లల ముందు వారు కూడా ఏమీ తెలియనివారి కిందే లెక్క. వాళ్ళు పంచ తత్వాలనూ తెలుసుకున్నారు, వాటిపై విజయాన్ని కూడా ప్రాప్తి చేసుకున్నారు కానీ చిన్న బిందువైన ఆత్మను తెలుసుకోలేదు. ఇక్కడైతే - నీవు ఎవరు అని చిన్న బాలుడిని అడిగినా కానీ ఏమని చెప్తాడు? నేను ఆత్మను అనే చెప్తాడు కదా. ఆత్మ ఎక్కడ ఉంటుంది, అది కూడా చెప్తాడు. మరియు వైజ్ఞానికులను అడగండి, ఆత్మ ఏమిటి? అని. వారు ఆత్మ జ్ఞానాన్ని ఇప్పటివరకు తెలుసుకోలేకపోయారు. కనుక చరిత్రపరంగా ఎంత గొప్పవారైనా కానీ, ఈ ప్రపంచము లెక్కలో ఎంత విశేషమైనవారైనా కానీ ఎవరైతే స్వయం గురించే తెలుసుకోలేదో వారి కన్నా ఇక్కడి ఐదు సంవత్సరాల బాలుడు కూడా విశేషమైనవానిగా అయ్యాడు. మీకు ప్రారంభంలో చాలా నషాతో కూడిన పాట ఒకటి ఉండేది, అది ఏ పాటో గుర్తుందా? ఒక పాట ఉండేది - ఎంత పెద్ద సేఠ్ అయినా కానీ, స్వామి అయినా కానీ భగవంతుని గురించి తెలుసుకోలేదు... కనుక ఎంత గొప్పవారైనా కానీ, వారు నేత అయినా లేక అభినేత (యాక్టర్) అయినా స్వయము గురించే తెలుసుకోనప్పుడు మరేం తెలుసుకున్నట్లు? కనుక మీరు అటువంటి విశేషాత్మలు. ఇక్కడి చదువుకోని వృద్ధ మాత ఒక వైపు ఉన్నారు, మరొక వైపు మంచి మహాత్మ ఉన్నారు అనుకోండి, ఈ వృద్ధ మాత - మేము పరమాత్మను పొందాము అని నషాతో అంటారు. కానీ మహాత్మ - పరమాత్మను పొందటము చాలా కష్టము అని అంటారు. కానీ ఇక్కడ 100 సంవత్సరాల వయసు ఉన్న వృద్ధ మాత కూడా నిశ్చయబుద్ధి కలవారైతే, ఆమె ఏమని చెప్తారు? మీరు వెతుకుతూనే ఉండండి, మేమైతే పొందేసాము. కనుక మహాత్ములు కూడా మీ ఎదురుగా ఏమైనట్లు! ప్రవృత్తివారు నషాతో అంటారు - మేము డబుల్ బెడ్పై పడుకున్నా, కలిసి ఉన్నా కూడా పవిత్రంగా ఉంటాము ఎందుకంటే మా మధ్య తండ్రి ఉన్నారు. మరియు మహాత్ములు ఏమంటారు? నిప్పు-దూది కలిసి ఉండటము, ఇదైతే అసంభవం అనిపిస్తుంది అని అంటారు. మరియు ఇది మీ కొరకు ఏమిటి? ప్రవృత్తి వారు చెప్పండి - పవిత్రంగా ఉండటము కష్టమా లేక సహజమా? సహజమా లేక అప్పుడప్పుడు కష్టమనిపిస్తుందా? ఎవరైతే దృఢంగా ఉంటారో వారు ఎంత పెద్ద సభలో అయినా లేక మరెక్కడైనా కానీ, పవిత్రత అయితే మా స్వధర్మము అని నషాతో చెప్పగలరు. అది పరధర్మము కాదు, స్వధర్మము. కావున స్వ అనేది సహజమనిపిస్తుంది, పరాయి అనేది కష్టమనిపిస్తుంది. అపవిత్రత పరధర్మము కానీ పవిత్రత స్వధర్మము. మరి ఇటువంటి మీ విశేషత గురించి తెలుసు కదా? ఎందుకంటే కొత్త-కొత్తవారు కూడా చాలామంది వచ్చారు కదా? కానీ ఎంత కొత్తవారైనా సరే పవిత్రతా పాఠమైతే దృఢంగా ఉంది కదా? చాలా మంది పిల్లలు ఇలా కూడా చేస్తారు - ఎప్పటివరకైతే తండ్రిని కలుసుకునేందుకు ఒక సంవత్సరం పూర్తవ్వదో, అందరికీ తెలుసు, ఈ నియమములో దృఢంగా ఉండాలి అని. కావున మధుబన్ కు వచ్చేంతవరకైతే బాగానే ఉంటారు కానీ చూసేసారు, చేరుకున్నారు అంటే చాలామంది తిరిగి వెళ్ళిన తర్వాత నిర్లక్ష్యులుగా కూడా అయిపోతారు, కానీ ఆలోచించండి - పవిత్రతా ప్రతిజ్ఞను ఎవరితో చేసారు? తండ్రితో చేసారు కదా? ఇది తండ్రి ఆజ్ఞ కదా? మరి తండ్రికి ప్రతిజ్ఞ చేసి మళ్ళీ ఒకవేళ నిర్లక్ష్యులుగా అయితే నష్టము ఎవరికి కలుగుతుంది? బ్రాహ్మణ పరివారములోనైతే ఒకరు వెళ్తే, 10 మంది వస్తారు. కానీ బలహీనంగా అవ్వడం వలన నష్టము ఆ ఆత్మలకే కలుగుతుంది, అందుకే కొత్త-కొత్తవారెవరైతే మొదటి సారి వచ్చారో, వారు తండ్రి ఇంటికైతే చేరుకున్నారు, ఇదైతే భాగ్యం యొక్క విషయమే కానీ ఆ భాగ్య రేఖను ఎప్పుడూ తగ్గించుకోకండి. భాగ్యాన్ని పెంచుకోండి.

చూడండి, లౌకికములో కూడా బిడ్డ జన్మించినప్పుడు అందరూ ఏమంటారు? సదా జీవించి ఉండాలి, దీర్ఘాయుష్షు

ఉండాలి. అలాగే బాప్ దాదా కూడా విశేష ఆత్మల అవినాశీ విశేషతను చూడాలనుకుంటారు, కొద్ది సమయానికి చెందిన విశేషత కాదు. ఒక సంవత్సరం నడిచారు, రెండు సంవత్సరాలు నడిచారు - ఇలా కాదు. అవినాశీగా ఉండేవారికే అవినాశీ ప్రారబ్ధము ప్రాప్తిస్తుంది. మరి మాతలు కూడా దృఢంగా ఉన్నారా? ఎందుకంటే మీరు ఒక సంవత్సరం వారైనా, రెండు సంవత్సరాల వారైనా లేక నాలుగు సంవత్సరాల వారైనా కానీ సమాప్తి అయితే ఒకే సమయములో జరగనున్నది కదా! వినాశనమైతే ఒకేసారి జరుగుతుంది కదా. లేక మేమైతే రెండు సంవత్సరాల వారము, మా సిల్వర్ జూబ్లీ జరగాలి, ఆ తర్వాత వినాశనం జరగాలి అని అంటారా! ఇదైతే జరగదు కదా, అందుకే వెనుక వచ్చేవారు ఇంకా ముందుకు వెళ్ళాలి. కొద్ది సమయములో చాలా సంపాదనను చేసుకోగలరు. ఎంతైనా మీకు పురుషార్థము యొక్క సమయమైతే లభించింది. మున్ముందైతే ఇంత సమయము కూడా లభించదు. ఇప్పుడు లేట్ (ఆలస్యమైంది) అన్న బోర్డు అయితే పెట్టడం జరిగింది కానీ టూ లేట్ (చాలా ఆలస్యమైపోయింది) అన్న బోర్డునైతే ఇంకా పెట్టలేదు అని వినిపించాము కదా. కనుక మీరందరూ అదృష్టవంతులు. కేవలము మీ భాగ్యాన్ని స్మృతిలో ఉంచుకుంటూ ముందుకు వెళ్తూ ఉండండి. ఇతర ఏ విషయాలలోకి వెళ్ళకండి.

పిల్లల పురుషార్థపు సమయము ఎందుకు వ్యర్థంగా పోతుంది అన్నదానిని ఈ రోజు బాప్ దాదా చూస్తున్నారు. వ్యర్థంగా పోవాలి అని ఎవరూ కోరుకోరు, మా సమయం సఫలమవ్వాలి అనే అందరూ కోరుకుంటారు కానీ మధ్య-మధ్యలో అక్కడక్కడా అరగంట, అక్కడక్కడా పదిహేను నిమిషాలు, అక్కడక్కడా ఐదు నిమిషాలు వ్యర్థంగా పోతూ ఉంటాయి. మరి దీనికి కారణము ఏంటి? ఈ రోజు బాప్ దాదా చూసారు - మెజారిటీ వారి పురుషార్థము తక్కువ అవ్వటానికి లేక ఢీలా అవ్వటానికి విశేషంగా మూడు కారణాలు ఉన్నాయి.

మొదటిది, నడుస్తూ-నడుస్తూ ఉండగా శ్రీమతంతోపాటు ఇతరాత్మల పరమతాన్ని కలిపేస్తారు. ఎవరో ఏదో విషయాన్ని వినిపించారు మరియు వినిపించేవారు మంచివారు, సత్యమైన మహారథి అని మీరు భావిస్తారు మరియు మీకు వారిపై నమ్మకము కూడా ఉంది, ఎప్పుడైనా అటువంటి ఆత్మ ఎవరైనా మీకు అటువంటి విషయాలు ఏవైనా వినిపిస్తే, ఈ సమాచారమైతే మంచిదే... అని మీకు దాని పట్ల ఆసక్తి కూడా కలుగుతుంది. ఏ విధంగా ప్రాపంచిక సమాచారం మంచిగా అనిపిస్తుంది కదా, అలాగే బ్రాహ్మణ ప్రపంచపు సమాచారం కూడా మంచిగా అనిపిస్తుంది, కనుక మీరు వారిపై విశ్వాసాన్ని ఉంచి ఆ విషయాన్ని విన్నారు అనగా మీ లోపల దానిని ఇముడ్చుకున్నారు, ఖండించలేదు, అక్కడ విషయము సత్యమైనదే, సమాచారము సత్యమైనదిగా కూడా ఉంటుంది, అన్నీ అసత్యమైనవే ఉండవు, కొన్ని సత్యమైనవి కూడా ఉంటాయి కానీ తండ్రి ఆజ్ఞ ఏమిటి? అటువంటి సమాచారము వినండి పర్వాలేదు - ఇదా బాబా ఆజ్ఞ? లేదు. దానితో మీకు ఎటువంటి సంబంధము లేదు, అది కేవలము మనసుకు ఇంపైన సమాచారము, మీరేమీ చెయ్యలేరు, కేవలము విన్నారంటే ఆ సమాచారము బుద్ధిలోకైతే వెళ్ళింది, సమయము వృథా అయ్యిందా లేదా? మరియు తండ్రి శ్రీమతములో పరమతాన్ని కలిపేసారు ఎందుకంటే తండ్రి ఆజ్ఞ ఏమిటంటే - వింటూ కూడా వినకండి. మరి మీరు ఎందుకు విన్నారు? అలవాటు చేసుకున్నారు. ఒకసారి మీకు సమాచారాన్ని వినిపించారనుకోండి, మీకు కూడా చాలా మంచిగా అనిపించింది, అది కొత్త విషయము, ఇలా కూడా జరుగుతుంది అన్నది తెలిసింది, కానీ ఒకవేళ ఒకసారి మీరు వారి విషయాన్ని వింటే ఇక రెండవ సారి వారు ఎక్కడికి వెళ్తారు? మీ దగ్గరకే వస్తారు. మీరు వారి కొరకు ఒక చెత్త డబ్బాలా అయ్యారు కదా! ఇటువంటి సమాచారము ఏది ఉన్నా సరే, వారు మీ వద్దకే వచ్చి వినిపిస్తారు ఎందుకంటే మీరు విన్నారు! అందుకే వారికి అర్థం చేయించండి, ఇటువంటి విషయాల నుండి వారిని కూడా విముక్తులుగా చెయ్యండి. అవి విని ఆసక్తిని పెంచుకోకండి. కానీ ఒకవేళ విన్నట్లయితే వారిలో కూడా సదా కొరకు ఫుల్ స్టాప్ పెట్టేంత, మీ లోపల కూడా ఫుల్ స్టాప్ పెట్టేంత శక్తి మీలో ఉందా? ఏ వ్యక్తి గురించైతే సమాచారాన్ని విన్నారో వారి పట్ల దృష్టిలో కానీ లేక సంకల్పములో కానీ ద్వేష భావము అసలు ఉండకూడదు. ఇంతటి శక్తి మీలో ఉన్నట్లయితే అది విన్నట్లు అవ్వదు, కళ్యాణము చేసినట్లు అవుతుంది. కానీ ఫలితం ఏం కనిపిస్తుందంటే - చాలామందిలో కొద్ది-కొద్దిగా చెత్త పోగవుతూ-పోగవుతూ ద్వేష భావము వచ్చేస్తుంది లేదంటే నడవడికలో తేడా వచ్చేస్తుంది. వేరే ఏమీ జరగకపోయినా కానీ ఆ ఆత్మ పట్ల సేవ చెయ్యాలి అన్న భావన ఉండదు, భారీతనము ఉంటుంది. దీనిసే - శ్రీమతములో పరమతాన్ని కలపటము అని అంటారు. సమాచారాన్ని అయితే బాప్ దాదా కూడా వింటారు. కానీ ఈ విషయంలో జరిగేదేమిటి? చాలామందిలో భావము మారిపోతుంది. వినిపించటంలో కూడా భావము మారిపోతుంది. ఒకరు వచ్చి అంటారు - వారిద్దరూ మాట్లాడుకోవటము నేను చూసాను. ఆ మొదటి వారు చెప్పింది విని రెండవ వారు అంటారు - అంతేకాదు, వారిద్దరూ నిలబడ్డారు కూడా కానీ మంచి పద్ధతిలోనైతే నిలబడలేదు. అంటే ఇక్కడ మరో విషయం కలిసింది. తర్వాత మూడవవారు అంటారు - వీరైతే అలా చేస్తూనే ఉంటారు. భావము ఎంత మారిపోయింది. అసలు వారి

భావన ఏమిటి కానీ మాటల్లో భావం ఎంతగా మారిపోయింది. ఈ పరమతం వాయుమండలాన్ని పాడు చేస్తుంది. కావున సమయం వ్యర్థంగా పోవటానికి ఒక కారణము పరమతము మరియు రెండవ కారణము పరచింతన. ఒకరి నుండి విషయాన్ని విన్నారంటే, దానిని ఎనిమిది-పదిమందికి వినిపించకుండా ఉండడమనేది జరగదు. ఒకవేళ ఎవరైనా దూరదేశంలో ఉన్నా కానీ వారికి ఉత్తరంలో కూడా వ్రాస్తారు - ఇక్కడ చాలా కొత్త విషయం జరిగింది, మీరు వచ్చినప్పుడు తప్పకుండా వినిపిస్తాము అని. మరి ఇదేమైనట్లు? పరచింతన. మీరు నలుగురికి వినిపించారనుకోండి, ఆ నలుగురి భావనను ఆ ఆత్మ పట్ల మీరు పాడు చేసారు కదా, మరియు పరచింతన అనేది మొదలయ్యింది అంటే దాని వేగం చాలా తీవ్రంగా ఉంటుంది మరియు దీర్ఘ కాలం ఉంటుంది.

పరచింతన అనేది ఒకటి-రెండు క్షణాలలో పూర్తవ్వదు. ఎవరికైనా జ్ఞానాన్ని వినిపించేటప్పుడు వారికి ఆసక్తి కలిగించడానికి దానిని కథ రూపంలో వినిపించండి అని బాప్ దాదా అంటారు. ముందు ఇలా జరిగింది, తర్వాత ఏమయిందంటే, తర్వాత ఏమయిందంటే, ఆ తర్వాత ఏమయిందంటే... అప్పుడు ఆసక్తి పెరుగుతుంది కదా. అలాగే పరచింతన కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అందులో వినేవారు తప్పకుండా ఆలోచిస్తారు - తర్వాత ఏమయింది, తర్వాత ఇలా జరిగిందా, అవును ఇలాగే జరిగి ఉంటుంది... కావున ఇది కూడా చాలా పెద్ద కథ. బాప్ దాదా అయితే అందరి మనసులోని విషయాలను వింటారు కూడా, చూస్తారు కూడా. ఎవరు ఎంతగా దాచిపెట్టే ప్రయత్నం చేసినా కానీ, బాప్ దాదా మాత్రం కేవలం లోకాన్ని దృష్టిలో పెట్టుకుని అందరి ముందు వారికి సూచనను ఇవ్వరు, అంతే తప్ప బాప్ దాదాకు మాత్రం అన్నీ తెలుసు, అన్నీ చూస్తారు. లేదు, నేనైతే ఎప్పుడూ చేయను అని ఎవరు ఎంత చెప్పినా కానీ బాప్ దాదా వద్ద రిజిస్టర్ ఉంది - ఎన్ని సార్లు చేసారు, ఏమేమి చేసారు, ఏ సమయంలో చేసారు, ఎంతమందితో చేసారు - ఈ రిజిస్టర్ అంతా ఉంటుంది. కాకపోతే అక్కడక్కడ మౌనంగా ఉండవలసి ఉంటుంది. కావున రెండవ విషయం వినిపించాము - పరచింతన. అటువంటి వారికి స్వచింతన ఎప్పుడూ నడవదు. ఏ విషయం జరిగినా కానీ, పరచింతన చేసేవారు తమ తప్పును కూడా ఇతరుల మీద వేస్తారు. మరియు పరచింతన చేసేవారు విషయాలను తయారుచేయడంలో నంబరువన్ గా ఉంటారు. తమ తప్పును పూర్తిగా ఎదుటివారిది అన్నట్లు ఎంతగా నిరూపిస్తారంటే అది వినే పెద్దవారు కూడా మౌనంగా ఉండిపోవలసి వస్తుంది. స్వచింతన అంటే కేవలం జ్ఞానం పాయింట్లను రిపీట్ చేయడం లేక జ్ఞానం పాయింట్లను వినడం, వినిపించడం - కేవలం ఇదే స్వచింతన కాదు. స్వచింతన అనగా తమలోని సూక్ష్మ బలహీనతలను, తమలోని చిన్న-చిన్న పొరపాట్లను చింతన చేసి తొలగించుకోవటము, పరివర్తన చేసుకోవటము, ఇది స్వచింతన. ఇకపోతే జ్ఞానాన్ని వినడము మరియు వినిపించడములో అయితే అందరూ తెలివైనవారే. అది జ్ఞాన చింతన, మననము. కానీ స్వచింతన యొక్క సూక్ష్మ అర్థము స్వయం పట్ల ఉంటుంది. ఎందుకంటే రిజల్టు వెలువడినప్పుడు - వీరు జ్ఞానాన్ని మంచిగా మననం చేసారు లేక సేవలో జ్ఞానాన్ని మంచిగా ఉపయోగించారు అన్నది చూడరు. ఈ రిజల్టు కన్నా ముందు - స్వచింతన మరియు పరివర్తన ఉండాలి, స్వచింతన చేయడము అంటే అర్థం పరివర్తన అవ్వడము. కావున ఫైనల్ రిజల్టు వచ్చినప్పుడు, అందులో ముందు మార్కులు ప్రాక్టికల్ గా ధారణా స్వరూపులుగా ఉన్నవారికి లభిస్తాయి. ఎవరైతే ధారణా స్వరూపులుగా ఉంటారో, వారు న్యాచురల్ యోగీగా ఉండనే ఉంటారు. ఒకవేళ మార్కులు ఎక్కువ పొందాలనుకుంటే, ముందుగా ఇతరులకు ఏదైతే వినిపిస్తారో, ఈ రోజుల్లో విలువలపై ఏదైతే భాషణ ఇస్తారో, దానిని ముందుగా స్వయంలో చెకింగ్ చేసుకోండి ఎందుకంటే సేవకు ఒక్క మార్కు అయితే, ధారణ స్వరూపులుగా అయినందుకు 10 మార్కులు ఉంటాయి, ఒకవేళ మీరు జ్ఞానాన్ని ఇవ్వలేకపోయినా కానీ మీ ధారణతో ప్రభావం చూపించినట్లయితే మీ సేవ యొక్క మార్కులు జమ అయినట్లే కదా.

ఈ రోజుల్లో చాలా మంది ఇలా అనుకుంటారు - మాకు సేవ యొక్క ఛాన్సు చాలా తక్కువగా లభిస్తుంది, మాకు ఛాన్సు లభించాలి, ఇతరులకు లభిస్తుంది, నాకెందుకు లభించడం లేదు? సేవ చేయడం చాలా మంచిది ఎందుకంటే ఒకవేళ బుద్ధి ఫ్రీగా ఉన్నట్లయితే వ్యర్థం చాలా నడుస్తుంది, అందుకే సేవలో బుద్ధి బిజీగా ఉండాలి, ఈ సాధనము మంచిదే. సేవా ఉత్సాహమైతే మంచిదే కానీ డ్రామానుసారంగా లేక పరిస్థితుల అనుసారంగా ఒకవేళ మీకు అవకాశం లభించలేదు అనుకోండి మరియు మీ అవస్థ ఇతరులకు సేవ చేసేందుకు బదులుగా మీ అవస్థ కూడా పడిపోయినట్లయితే లేక ఆ సేవ మిమ్మల్ని అలజడిలోకి తీసుకొచ్చినట్లయితే, అప్పుడు అదేమి సేవ అయినట్లు? ఆ సేవకు ప్రత్యక్ష ఫలము ఏమి లభిస్తుంది? సత్యమైన సేవ, ప్రేమతో సేవ, అందరి ఆశీర్వాదాలతో సేవ, దాని ప్రత్యక్ష ఫలము సంతోషము మరియు ఒకవేళ సేవలో ఫీలింగ్ వచ్చినట్లయితే ఇక్కడ బ్రాహ్మణులు ఫీలింగ్ ను ఏమంటారు? ఫ్లూ (ఒక రకమైన జ్వరం). ఫ్లూ వచ్చినవారు ఏమి చేస్తారు? నిద్రపోతారు. ఆహారం తినరు, నిద్రపోతారు. ఇక్కడ కూడా ఫీలింగ్ వస్తే అయితే తినడం మానేస్తారు లేదా అలిగి కూర్చుంటారు. కావున ఇది ఫ్లూ కదా. ఒకవేళ మీరు ధారణా స్వరూపులైతే, సత్యమైన

సేవాధారులైతే, అది స్వార్థపూరితమైన సేవ కాదు. ఒకటేమో కళ్యాణ భావనతో చేసే సేవ, ఇంకొకటి స్వార్థంతో చేసేది. నాకు పేరు వస్తుంది, వార్తాపత్రికలో నా ఫోటో వస్తుంది, నాది టి.వి.లో వస్తుంది, బ్రాహ్మణులలో నా పేరు ప్రఖ్యాతమవుతుంది, బ్రాహ్మణి నన్ను ఎంతో ముందుంచుతారు, అడుగుతారు... ఈ భావాలన్నీ స్వార్థపూరితమైన సేవకు చెందినవి ఎందుకంటే ఈ రోజుల పరంగా, ప్రత్యక్షత పరంగా, ఇప్పుడు సేవ అనేది మీ వద్దకు వస్తుంది. ప్రారంభంలో స్థాపనా విషయము వేరు, కానీ ఇప్పుడు మీరు సేవ వెనుక వెళ్ళరు. మీ వద్దకు సేవ దానంతటదే వస్తుంది. కావున సత్యమైన సేవాధారి ఎవరైతే ఉన్నారో, ఆ సేవాధారికి ఒకవేళ ఏ సేవ లభించకపోయినా కానీ బాప్ దాదా అంటారు - మీ ముఖంతో, మీ నడవడికతో సేవ చేయండి. మీ ముఖము తండ్రిని సాక్షాత్కారము చేయించాలి. మీ ముఖము, మీ నడవడిక తండ్రిని గుర్తు తెప్పించాలి. ఈ సేవ నంబరువన్. ఎలాంటి స్వార్థ భావము లేనటువంటి సేవాధారులుగా ఉండాలి. నాకే ఛాన్సు లభించాలి, నాకే లభించాలి, ఎందుకు లభించదు, లభించాలి - ఇటువంటి సంకల్పాలను కూడా స్వార్థము అని అంటారు. బ్రాహ్మణ పరివారంలో మీ పేరు ప్రఖ్యాతమై ఉండకపోవచ్చు, మీరు మంచి సేవాధారి అయి ఉండవచ్చు అయినా కానీ మీకు పేరు లేదు, కానీ తండ్రి వద్ద అయితే పేరు ఉంది కదా, తండ్రి హృదయంలో పేరు ఉంది అన్నప్పుడు ఇంకేం కావాలి! మరియు కేవలం తండ్రి హృదయంలో మాత్రమే కాదు, ఎప్పుడైతే ఫైనల్ లో నంబరు లభిస్తుందో, అప్పుడు మీ నంబరు ముందుంటుంది ఎందుకంటే బాప్ దాదా లెక్క ఉంచుతారు. మీకు ఛాన్సు లభించలేదు, మీరు రైట్ కానీ ఛాన్సు లభించలేదు అంటే, అది కూడా నోట్ అవుతుంది. మరియు అడిగి ఛాన్సు తీసుకున్నారు, అది చేసారు కూడా, కానీ అందుకు కూడా మార్కులు కట్ అవుతాయి. ఈ ధర్మరాజు ఖాతా తక్కువేమీ కాదు. ఇవి చాలా సూక్ష్మమైన లెక్కలు, అందుకే నిస్వార్థ సేవాధారులుగా అవ్వండి, తమ స్వార్థము ఉండకూడదు. కళ్యాణం జరగాలన్న స్వార్థం ఉండాలి. ఒకవేళ మీకు ఛాన్సు ఉంది మరియు వేరే వారు - నాకు కూడా ఛాన్సు లభిస్తే చాలా బాగుంటుంది అనుకుంటున్నారు, అంతేకాక వారు యోగ్యులు కూడా, అప్పుడు ఒకవేళ మీరు మీ ఛాన్సును వారికి ఇచ్చినట్లయితే, అందుకు కూడా మీ వాటా అందులో జమ అవుతుంది. మీరు చేయకపోవచ్చు, కానీ ఎవరికైనా ఛాన్సు ఇచ్చారంటే అందులో కూడా మీ వాటా జమ అవుతుంది ఎందుకంటే సత్యమైన వజ్రంగా అవ్వాలి కదా. కనుక లెక్కలను కూడా అర్థం చేసుకోండి, అలా నిర్లక్ష్యంగా నడుచుకోకండి, సరేలే, జరిగిపోయింది... లెక్కలు పుస్తకం చాలా సూక్ష్మంగా ఉంది. తండ్రి ఏమీ చేయాల్సిన అవసరం ఉండదు, ఆటోమేటిక్ గా జరిగిపోతుంది. అప్పుడప్పుడు బాప్ దాదా పిల్లల లెక్కల పుస్తకాన్ని చూస్తారు కూడా. కావున మొదటి విషయము పరమతము మరియు రెండవ విషయము పరచింతన.

మూడవది పరదర్శన. ఇతరులను చూడటంలో మెజారిటీ చాలా తెలివైనవారిగా ఉన్నారు. పరదర్శన - ఏదైతే చూస్తారో, చూసిన తర్వాత అది ఎక్కడికి వెళ్తుంది? బుద్ధిలోకే వెళ్తుంది కదా. మరియు ఎవరైతే ఇతరులను చూడటంలో సమయాన్ని వెచ్చిస్తారో, వారికి తమను తాము చూసుకునేందుకు సమయం ఎక్కడ లభిస్తుంది? విషయాలైతే ఎన్నో జరుగుతాయి కదా, మరియు ఏవైతే విషయాలు జరుగుతాయో, అవి కనిపిస్తాయి కూడా, వినిపిస్తాయి కూడా, ఎంత పెద్ద సంగఠన అయితే అంత పెద్ద విషయాలు జరుగుతాయి. ఈ విషయాలు ఎందుకు జరుగుతాయి? ఈ విషయాలు జరగకూడదు అని చాలా మంది అనుకుంటారు. జరగకూడదు అన్నది కరక్టే కానీ వేటి గురించైతే జరగకూడదు అని మీరు అనుకుంటున్నారో, వాటికి సమయాన్ని ఎందుకు ఇచ్చారు? ఈ విషయాలే కదా పేపర్లు. ఎంత పెద్ద చదువు అయితే, అంత పెద్ద పేపర్లు కూడా ఉంటాయి. ఇటువంటి వాయుమండలం తయారవ్వడం కూడా అందరి కొరకు పేపరు వంటిదే, పరమతము లేక పరదర్శన లేక పరచింతన నుండి ఎంతవరకు స్వయాన్ని సురక్షితంగా ఉంచుకుంటారు? రెండు వేర్వేరు విషయాలు ఉన్నాయి. ఒకటేమో బాధ్యత, దాని కారణంగా వినాల్సి కూడా వస్తుంది, చూడాల్సి కూడా వస్తుంది. ఆ సందర్భంలో కళ్యాణ భావనతో వినండి మరియు చూడండి. బాధ్యత ఉంది, కళ్యాణ భావన ఉంది, అది కరక్టే. కానీ మీ అవస్థను అలజడిలోకి తీసుకొచ్చి చూడటము, వినడము లేక ఆలోచించడము - ఇది తప్పు. ఒకవేళ మిమ్మల్ని మీరు బాధ్యత కలవారిగా భావిస్తే, ఆ బాధ్యత కన్నా ముందు మీ బ్రేక్ ను శక్తిశాలిగా చేసుకోండి. ఏ విధంగా కొండ పైకి ఎక్కేటప్పుడు ముందు నుండే సూచన ఇస్తారు కదా - మీ బ్రేక్ ను సరిగ్గా చెక్ చేసుకోండి అని. బాధ్యత కూడా ఒక ఉన్నతమైన స్థితి, బాధ్యతను తీసుకోండి కానీ ముందుగా ఇది చెక్ చేసుకోండి - క్షణంలో బిందువు పెట్టడం అవుతుందా? లేక పెట్టడం బిందువు పెడతారు కానీ అది ప్రశ్నార్థకంగా అవుతుందా? అది తప్పు. అందులో సమయము మరియు శక్తి వృథా అవుతుంది, అందుకే ముందుగా మీ బ్రేక్ ను శక్తిశాలిగా చేసుకోండి. సరే - చూసారు, విన్నారు, ఎంత వీలైతే అంత కళ్యాణం చేసారు, ఇక ఫుల్ స్టాప్. ఒకవేళ ఇటువంటి స్థితి ఉన్నట్లయితే బాధ్యతను తీసుకోండి, లేదంటే చూస్తూ చూడకుండా ఉండండి, వింటూ వినకుండా ఉండండి, స్వచింతనలో ఉండండి. ఇందులోనే లాభము ఉంది. మరి ఈ నాటి పాఠము ఏమిటి? పరమతము, పరచింతన మరియు పరదర్శన - ఈ మూడు విషయాల

నుండి ముక్తులుగా అవ్వండి మరియు ఒక్క విషయాన్ని ధారణ చేయండి, ఆ ఒక్క విషయం ఏమిటంటే - పరోపకారిగా అవ్వండి. మూడు రకాల 'పర' అన్నవాటిని సమాప్తం చేయండి మరియు ఒక 'పర' - పరోపకారిగా అవ్వండి. అలా అవ్వడం వస్తుందా? మరి ఏ విషయాల నుండి ముక్తులుగా అవుతారు? మాతలు ఏం చేస్తారు? పిల్లలకు ఉపకారులా లేక పరోపకారులా? సర్వులకు ఉపకారి. సహజమా లేక కష్టమా? అచ్ఛా.

నలువైపులా ఉన్న విశ్వంలోని సర్వ విశేష ఆత్మలకు, సదా స్వచింతన, జ్ఞాన చింతనను చేసే శ్రేష్ఠ ఆత్మలకు, సదా తండ్రి యొక్క శ్రేష్ఠ మతంపై ప్రతి సంకల్పము, మాట మరియు కర్మను చేసే సమీప ఆత్మలకు, నలువైపులా డైమండ్ జూబ్లీ కోసం స్వయాన్ని మరియు సేవను ముందుకు తీసుకువెళ్ళేవారు - ఇటువంటి విశేషాత్మలకు బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- మహావీరులుగా అయి సంజీవనీ మూలిక ద్వారా మూర్ఛితులను జాగృతులుగా చేసే శక్తివాన్ భవ

ఏ విధంగా సూర్యుడు స్వయం శక్తిశాలిగా ఉన్న కారణంగా తన శక్తితో నలువైపులా ప్రకాశాన్ని వ్యాపింపజేస్తాడో, అలా శక్తివంతులుగా అయి అనేకులకు సంజీవనీ మూలికను ఇచ్చి మూర్ఛితులను జాగృతులుగా చేసే సేవను చేస్తూ ఉండండి, అప్పుడు మహావీరులు అని అంటారు. సదా స్మృతిలో ఉంచుకోండి - మేము విజయులుగా ఉండాలి మరియు అందరినీ విజయులుగా తయారుచేయాలి. విజయులుగా అయ్యేందుకు సాధనము, బిజీగా ఉండడము. స్వకళ్యాణము మరియు విశ్వకళ్యాణ కార్యంలో బిజీగా ఉన్నట్లయితే విఘ్న వినాశక వాయుమండలము తయారవుతూ ఉంటుంది.

స్లోగన్:- హృదయము సదా ఒక్క హృదయాభిరామునిపై నిలిచి ఉండాలి - ఇదే సత్యమైన తపస్య.